సోఫాలో కూర్చుందామె. సరికొత్త అలంకరణతో సరికొత్త హెయిర్ స్టయిల్లో వుంది .

"ఏమిటలా చూస్తున్నావు? బాగా నిద్ర పట్టిందా?" కవ్వింపుగా నవ్వుతోంది.

"ఇంత అందం పక్కనుంటే యింకా నిద్రా?" ఎదురుగ్గా కూర్చుంటూ అడిగాడు.

"ఇంత చక్కగా మాట్లాడటం కూడా రాదు అర్జున్‌కి" మత్తుగా రహస్యంగా మాట్లాడుతోందామె. అసలు విషయం తెలుసుకోటానికి ఇదే సమయం.

"నాకు అసలు సంగతి చెప్పేస్తారా మేడమ్?" సూటిగా ఆమె వంక చూస్తూ అడిగాడు సురేష్.

"ఏ విషయం?" నవ్వుతూ అడిగింది.

"ఏ విషయమో మీకు తెలుసు"

కొద్దిసేపు ఆలోచనలో మునిగిపోయిందామె.

"సురేష్ ! నేను చెప్పేదంతా చాలా రహస్యం. ఎవ్వరికీ తెలీకూడదు"

"చిన్నప్పుడు నన్ను 'బ్యాంక్ లాకర్' అని ఏడిపిస్తుండే వాళ్ళు మా ఫ్రెండ్స్. ఫర్లేదు చెప్పండి"

"ఈ మధ్య అర్జున్‌కి మానసిక వ్యాధి సోకింది ! ఎదుటి మనిషిని గుర్తుపట్టలేక పోవటం. తనెవరో తనకు తెలీకపోవటం......ఒకోసారి గట్టిగా అరవటం.....పారిపోవడానికి ప్రయత్నించటం ....ఇలా రకరకాలుగా వుంటోంది ప్రవర్తన. డాక్టర్స్ చాలా రోజుల వరకూ రకరకాల వైద్యాల ద్వారా నయం చేయడానికి ప్రయత్నించి చివరికి చెప్పిన అభిప్రాయం ఒకటే. మరికొద్ది రోజుల్లో అతను పూర్తిగా పిచ్చివాడవుతాడని. ఈ పరిస్థితిలో అతను పెట్టాలనుకున్న కొత్త ఇండస్ట్రీలు, ప్రభుత్వ లైసెన్స్‌లు, బ్యాంక్ రుణాలు.....ప్రస్తుత ఆస్తులుఇవన్నీ అతను సక్రమంగా చూసుకోలేక పోవటం చేత ఆ స్థానంలో నిన్ను తీసుకురావాల్సి వచ్చింది. కొత్త లైసెన్స్‌ల సందర్భంలో, కొత్త ఇండస్ట్రీ విషయంలో ఆర్థిక మంత్రిత్వ శాఖలో అధికారులకూ, బ్యాంక్ అధికారులకూ లక్షలకు లక్షలు లంచాలు యివ్వటం గురించి న్యూస్ పేపర్లో వాళ్ళు గొడవ చేస్తున్న విషయం నీకూ తెలుసు కదా? ఇలాంటి పరిస్థితులో నీలాంటి వ్యక్తి అవసరం ఏర్పడింది " మాట్లాడటం ఆపి తన మీద వున్న చిలుకను ముద్దుపెట్టుకుందామె.

"ఇప్పుడు నీకు అర్థమైందనుకుంటాను?"

"కానీ ఆ బిజినెస్ వ్యవహారాలన్నీ మీరే డీల్ చేయవచ్చుకదా?"

"దానికి చాలా ప్రాబ్లెమ్స్ వున్నాయి. ముఖ్యంగా మరికొన్ని ఆర్థిక సంస్థల నుంచి రావాల్సిన పెట్టుబడులు ఆగిపోతాయి. అర్జున్‌కి పిచ్చెక్కిందని తెలిస్తే ఇంతవరకూ లభించిన లోన్స్ ఇతర ఇండస్ట్రీయల్ క్రెడిట్స్ మెషినరీ సప్లయెర్స్....అందరూ భయపడి అన్నీ

రద్దు చేసుకునే అవకాశముంది కనుక నేను పూర్తిగా అంతా హేండోవర్ చేసుకునేవరకూ మీ అవసరం వుందిక్కడ"

సురేష్ మాట్లాడలేదు. ఆమెవంక కళ్ళార్పకుండా చూస్తున్నాడు. చిన్నప్పటినుంచీ అమ్మాయిల స్నేహం వలన తను వాళ్ళ సైకాలజీలో పండిపోయాడు.

మాధురి తనకు చెప్పిందంతా నిజమేనా? ఎందుకో నమ్మబుద్ధి కావటం లేదు ఈ ఆరు నెలలూ గడిచాక తను మర్డర్ చేయబడటం ఖాయం. అర్జున్ రూపంలో తనను వదిలేయటం కల్ల.

ఆమె లేచి నిలబడింది.

"నేనింక వెళ్ళాలి...." అంది రహస్యంగా "అర్జున్‌కి మళ్ళీ డిప్రెషన్ వచ్చింది. గదిలో వున్నాడు యిప్పుడెలా వుందో చూడాలి".

అతనికి సమీపంగా వచ్చిందామె. ఆమె చేయి అతని నడుం చుట్టూ తిరిగింది.

"ఇవాళ రాత్రి కూడా వస్తాను........" అంది మత్తుగా సెక్సీగా.

"ఇవాళ రాత్రిక్కూడా వస్తాను" అంది చిలుక.

"విష్ణుకి ఈ సంగతి తెలుసా?"

ఆమె నిర్లక్ష్యంగా నవ్వింది "అతను నా దగ్గర వుద్యోగి......"

ఆమె తన పెదాలను అతని పెదాలకు ఆనించింది.

"నిజంగా నువ్వు అర్జున్‌వే! నిజంగానే అర్జున్ వవుతావు" గోడలో దాగివున్న తలుపు తెరచుకుని వెళ్ళిపోయింది.

"నిజంగానే అర్జున్‌వవుతావు" అన్నమాట అతని చెవిలో మార్మోగుతోంది.

ఏమిటి దానర్థం? తనను శాశ్వతంగా అర్జున్ స్థానంలో వుంచేస్తుందా? తను శాశ్వతంగా అర్జున్ అవుతాడా? ఆమెతో సంసారం చేస్తూ కోట్లకొద్దీ ఆస్తి అనుభవిస్తూ, ప్లేన్స్‌లో, కార్లల్లో తిరుగుతూ....మరి అర్జున్ సంగతేమిటి?

వాటెబౌట్ తులసి ? నో! తనకివేమీ వద్దు ..తులసి కావాలి....ఆమెతో జీవితం కావాలి ! అంతే!

తలుపు కొట్టిన చప్పుడయింది. విష్ణు లోపలికొచ్చాడు.

"భోజనం కావాలా?"

"ఎస్ చాలా ఆకలేస్తోంది ?"

విష్ణు నవ్వాడు " ఈ శ్రమంతా ఫుడ్ కోసమే పడుతున్నావు....ఇంకోసారి భోజనం మీద కోపగించుకోకు! కడుపు మాడుతుంది" వెళ్ళి పోయాడు. వెంటనే భోజనం వచ్చింది.

భోజనం ముగించాడు అతను. ఆలోచనలు మాత్రం వదలటం లేదు.

ఏదోక ఉపాయం ఆలోచించి పారిపోవాలి యిక్కడి నుంచి ..

రాత్రాను ఇది కత్తుల బోనులాగా తయారవుతోంది.

తిరిగి అర్థరాత్రి దాటుతోండగా తిరిగి అతని గదిలోకి వచ్చింది మాధురి. కొద్దిసేపు నిశ్శబ్దంగా ఒకరికన్నా ఒకరు ఉద్రేకంతో ప్రణయం జరిపాక మామూలు స్థితికొచ్చారు.

“ప్రేమికులు మంచి స్నేహితులు కూడా అవుతారు ..కదూ?” అడిగింది మాధురి రహస్యం చెపుతున్నట్లు.

అతను అర్థం కానట్లు చూశాడు.

“మంచి స్నేహితుల మధ్య రహస్యాలు వుండకూడదని నా అభిప్రాయం”

“ఇప్పుడా విషయం ఎందుకు?”

“మనిద్దరి మధ్యా నమ్మకం అనేది వుండాలి...లేకపోతే ప్రేమకు అర్థమేమిటి?”

“అఫ్‌కోర్స్ ! అయ్ బిలీవ్ యూ! నామీద నీకు నమ్మకముందో లేదో తెలీదు”

“పూర్తి నమ్మకముంది సురేష్ ! అందుకే నా మనసులోని ఆలోచన నీకు చెప్పదలుచుకున్నాను”

“ఏమిటది?” అనుమానంగా అడిగాడు.

ఆమె అతనివేపు తిరిగింది. ఆమె శరీర స్పర్శ నిలువునా మళ్ళీ దహించటం ప్రారంభమయింది.

“సురేష్! నాకో సహాయం చేయగలవా”

“ఏమిటది?”

“నా కోసమే కాదు... మనిద్దరికోసం. నువ్వే శాశ్వతంగా అర్జున్‌వవుతావా?”

గుండె వేగంగా కొట్టుకోవటం ప్రారంభమైంది. చెమటలు పట్టసాగాయి. సరిగ్గా వూపిరందటంలేదు.

“శాశ్వతంగానా?”

“అవును. అర్జున్ ఎలాగూ పిచ్చివాడయ్యాడు...నాకు మాత్రం తోడెవరుంటారు? మనిద్దరికీ ఒకరంటే ఒకరికి ప్రేమ అనేది ఏర్పడింది గనుక జీవితాంతం ఎందుకు కలిసి వుండకూడదు?”

అంతవరకూ ఉద్రేకం కలిగించిన ఆమె నగ్న శరీర స్పర్శ ఇప్పుడు ఏ మాత్రం చలనం కలిగించలేపోతోంది.

మాధురి సామాన్యమయిన యువతి కాదు. తను ఆమె ఆలోచనలు తెలుసుకోలేనంత మూర్ఖుడు కాదు! తను శాశ్వతంగా అర్జున్‌గా వుండడానికి వప్పుకున్నాక....మంచిరోజు చూసి తనను అంతం చేస్తారు. అప్పుడు ఆస్తి అంతటికీ ఆమె వారసురాలవుతుంది. భర్త కారు

ప్రమాదంలో చనిపోయినట్లు పేపర్‌లో వస్తుంది. అర్జున్ ఎలాగూ పిచ్చివాడు గనుక అతని జీవితం ఆ గదిలోనే గడిచిపోతుంది.

"నేనంటే నీకు యిష్టంలేదా సురేష్ ?" మెత్తగా మరింత దగ్గరగా హత్తుకుంటూ అడిగిందామె.

"నేనన్నానా అలా"

"మరి జవాబు చెప్పవేం?" ఈ సహాయం వూరికే చేయనక్కర్లేదులే. కావాలంటే ఇంకో పది లక్షలు నీ సొంతానికి తీసుకోవచ్చు"

"సరే....నీ యిష్టం ! మీరెలా చెపితే అలా...." ఆలోచించుకుంటూ అన్నాడతను. ముందు మాధురికి తన మీద నమ్మకం కలిగించటం ముఖ్యం . ఆమె ఎవ్వర్ని నమ్మే మనిషి కాదని తనకు తెలుసు. అయినా ఆమె తను నమ్ముతోంది అని అనుకుంటున్నట్లు నటించటం అవసరం.

"థాంక్యూ డియర్! యూఆర్ ఎ వండర్‌ఫుల్ లవర్"

"అవుటాఫ్ ఎక్స్‌పీరియన్స్"

ఆమె నవ్వింది......తెరలు తెరలుగా.

*    *    *    *

ఆఫీస్‌వేపు వెళుతోంది కారు.

ముందూ వెనుక మళ్ళీ హత్యా ప్రయత్నం చేయడానికి ఎవరయినా వస్తున్నారేమోనని జాగ్రత్తగా చూస్తున్నాడు సురేష్ .

ఇవాళ ఎలాగయినా తులసి విషయం తెలుసుకోవాలి. అందుకే ఒకే ఒక్క మార్గముంది .

ప్రత్యూష.

ఆమెను వుపయోగించుకుంటే తను క్షేమంగా వున్న విషయం తులసికి తెలుస్తుంది.

తులసి క్షేమ సమాచారాలు తనకూ తెలుస్తాయి.

కానీ ఇది విష్ణుకి తెలీకూడదు. ఎట్లా?

తను ప్రత్యూషతో ఏం మాట్లాడినా అన్నీ వెనుక వున్న విష్ణుగదిలోకి వినబడతాయి. పైకి కనబడకుండా తన గదిలోకి మైక్‌లు అమర్చివున్నాయి.

ఆఫీస్ రూమ్‌కి చేరుకున్నాడు.

విష్ణు వెనుక గదిలోకెళ్ళిపోయాడు. ప్రెస్ పార్టీ వచ్చింది. మళ్ళీ సహదేవ్ తన పక్కనే వున్నాడు. వాళ్ళ ప్రశ్నలకు తడుముకోకుండా సమాధానం చెపుతున్నాడతను. మధ్యలో సహదేవ్ టెక్నికల్ డిటేయిల్స్ యిస్తున్నాడు.

వాళ్ళు వెళ్ళిపోయిన తర్వాత ప్రత్యూష ఫైల్స్ తీసుకొచ్చింది సంతకాలకు.

ఆమె కళ్ళలోకి చూశాడు సురేష్. ఆమె కూడా అతని కళ్ళల్లోని చూసి చూపులు మరల్చుకుంది. ఆమెతో ఏం మాట్లాడినా విష్ణు వచ్చేస్తాడు.

"ఈ జాబ్ ఎలా వుంది మిస్ ప్రత్యూషా?"

"ఫైన్ సర్! థాంక్యూ "

ఆమెతో మాట్లాడుతూనే చకచకా లెటర్ హెడ్‌లో తనక్కావల సిన వివరాలు రాసేస్తున్నాడు.

"నిన్న టి.వి.లో సినిమా చూశావా ప్రత్యూష?"

"ఎస్సర్! వెరీగుడ్ ఫిలిమ్......"

అతని గొంతు ఎక్కడో, ఎప్పుడో వింది. బాగా పరిచయమున్న గొంతు కానీ ఎవరిదీ అనేదే తెలీటం లేదు.

అతను రాసిన కాగితం చకచకా మడత పెట్టేశాడు.

అతని వైపు ఆశ్చర్యంగా చూస్తోందామె.

"సంతకాలు చేశాక పిలుస్తాను... ఇక నువ్వు వెళ్ళవచ్చు.." అంటూ తన చేతిలోంచి కాగితం చటుక్కున ఆమె ముందుకు తోసి కళ్ళతో సైగ చేశాడు.

ఆమె నిర్ఘాంతపోయింది.